క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన సింగరేణి పర్సనల్ జీఎం



బసవయ్య నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న సుధాకర్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్పొరేట్ జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ)గా సామ్యేల్ సుధాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన కట్టా బసవయ్య గత నెల 30న ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో సింగరేణి సూపర్ బజార్ ఎండీగా పనిచేస్తున్న సుధాకర్‌కు యాజమాన్యం అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బసవయ్య నుంచి సామ్యేల్ బాధ్యతలు స్వీకరించారు.

వలసలతో కాంగ్రెస్ మునగడం ఖాయం



మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: వలసలను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ పరిస్థితే ఎదురవుతుందని బీఎస్పీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి యెర్రా కామేష్ తెలిపారు. కొత్తగూడెంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ... కొందరు నాయకులు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి వెళ్తున్నారని విమర్శించారు. కాగా, ఒత్తిళ్లను ఎదుర్కొంటూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న తనను ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున రావు, నాయకులు సాయి, అల్లకొండ శరత్, వంగా రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల జాతర



బోనాలతో వస్తున్న మహిళలు

జూలూరుపాడు: నల్లబండబోడు గ్రామ ప్రజలు గురువారం బోనాల జాతరను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామంలో నాభిశిల, శ్రీముత్యాలమ్మతల్లి, శ్రీఆంజనేయస్వామి దేవతా విగ్రహాల ప్రతిష్ఠ మూడో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామదేవతలను మహిళలు, ఆడపడుచులు దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాన్ని నైవేద్యంగా సమర్పించారు.

విద్యార్థుల యూనిఫాం సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్‌రావు

ఇల్లెందురూరల్: వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ప్రతీ పాఠశాలకు అవసరమైన యూనిఫాం సిద్ధంగా ఉండాలని ఎంఈఓ పిల్లి శ్రీనివాస్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సెర్ప్ అధికారులు, పొదుపు సంఘాల మహిళలతో గురువారం ఆయన సమావేశమయ్యారు. మాట్లాడుతూ.. ప్రతీ పాఠశాలకు సంబంధించి దుస్తులు అందుబాటులో ఉన్నాయని, మహిళలు వెంటనే కుట్టు పనులు ప్రారంభించాలని, అందుకు అవసరమైన వసతులు కూడా సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. సెర్ప్‌లో క్లస్టర్ వారీగా అధికారులు బాధ్యత తీసుకోవాలని కోరారు. ఎంపీఓ చిరంజీవి, ఏపీఎం దుర్గారావు, ప్రత్యేకాధికారి సుభాష్, సెర్ప్ సీసీలు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీగా ప్రమోద్ తొలగింపు

ఇల్లెందురూరల్: ఇల్లెందు వైస్ ఎంపీపీగా దాస్యం ప్రమోద్‌ను తొలగిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనపై ఎంపీటీసీలు అవిశ్వాసం పెట్టడంతో ఫిబ్రవరి 8న మండల పరిషత్ కార్యాలయంలో ఓటింగ్ నిర్వహించారు. ఈ మేరకు మద్దతుగా 11 మంది ఎంపీటీసీలు చేతులెత్తడతో అవిశ్వాసం నెగ్గినట్లయింది. దీంతో ప్రమోద్‌ను పదవి నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు విడుదల కాగా, కలెక్టర్ ప్రియాంక అల గురువారం మండల పరిషత్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా నూతన వైస్ ఎంపీపీ నియామకంపై ఉత్తర్వుల్లో ఎలాంటి వివరాలు వెల్లడించలేదు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

పాల్వంచ: ప్రతీ వ్యక్తి తన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని అడిషనల్ కలెక్టర్, డీఆర్‌డీఓ విద్యాచందన అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, క్రీడాకారులు, కోచ్‌లు, టీటీడబ్ల్యూఆర్‌డీసీ విద్యార్థులు మొత్తం 300 మంది పట్టణంలో గురువారం ఓటర్లకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్‌లో మానవ హారం చేపట్టారు. విద్యాచందన మాట్లాడుతూ... ఓటింగ్ శాతం పెంచాలని, మెరుగైన సమాజం కోసం తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి, పట్టణ ఎస్ఐ బి.రాము, ప్రిన్సిపాల్ బి.రాజేశ్వరి, అనురాధ, పీడీ శ్వేత, లక్ష్మి, మంజియాని, సైదులు, పరంధామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాల్వంచ: అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం చేపట్టిన విద్యార్థులు

జూలూరుపాడు: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీఒక్కరు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ అన్నారు. గురువారం జూలూరుపాడు పోలీస్‌స్టేషన్ నుంచి శ్రీ షిర్డీసాయిబాబా ఆలయం వరకు బెటాలియన్ పోలీస్‌లతోపాటు, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. సురక్షితమైన, స్వేచ్ఛయుత, శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. సీఐ ఇంద్రసేనారెడ్డి, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు జీవన్‌రాజు, చంద్రశేఖర్, జుబేదా పాల్గొన్నారు.

ఓటు విలువపై అవగాహన

ఇల్లెందు: ఈ నెల 13న జరగనున్న 18వ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ ఓటరు విధిగా తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని, ప్రశాంతంగా ఎన్నికలు జరగాలని, ఎలాంటి అల్లర్లకు అవకాశం ఇవ్వరాదని, అన్ని పార్టీలు ఎన్నికల నియమావళి పాటించాలని, పోలీసులకు, ఎన్నికల అధికారులకు సహాయ సహకారాలు అందించాలని డీఎస్పీ చంద్రభాను కోరారు. గురువారం ఇల్లెందు సీఐ కరుణాకర్‌తో కలిసి కొమురారం, పోలారం, పోచారం తండా, మాణిక్యారంలో ఎన్నికలపై అవగాహన సమావేశాలు నిర్వహించారు. ప్రజలకు ఓటు విలువపై అవగాహన కల్పించారు. ఎన్నికల నిబంధనలను వివరించారు. మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో ఓటర్లంతా నిర్ణత సమయంలో ఓటు వేసి సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా అవసరమైన సదుపాయాల కోసం తీసుకోవాల్సిన చర్యలను తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పోలీసులు నిరంతరం ప్రజాసేవలో ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పక్షాలు సహకరించాలని కోరారు.

టేకులపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి భయాందోళనలు లేకుండా నిర్భయంగా ఓటింగ్‌లో పాల్గొనాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. ఈ మేరకు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో భయాన్ని తొలగించి, ఓటింగ్‌పై అవగాహన, ప్రజలకు అండగా పోలీసులు ఉన్నారనే ధైర్యం ఇచ్చేందుకు మండల కేంద్రంలో ఫ్లాగ్ మార్చ్, ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సీఐ తాటిపాముల సురేష్, ఎస్ఐలు షేక్ సైదా రవూఫ్, పాడిశెట్టి శ్రీకాంత్, సందీప్, సోమేశ్వర్, పోలీసులు, ఆర్మీ, సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.



ఇల్లెందు: మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను, పక్కన సీఐ కరుణాకర్



టేకులపల్లిలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



జూలూరుపాడు: మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

ఈ-శ్రామ్‌కార్డుతో ఆర్థిక భద్రత

కొత్తగూడెంటౌన్: అసంఘటిత కార్మికులకు ఈ-శ్రామ్‌కార్డు ఆర్థిక భద్రత నిస్తుందని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. గురువారం కొత్తగూడెంలోని బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన న్యాయ చైతన్య సదస్సుకు ముఖ్యఅతిథిగా జిల్లా జడ్జి భానుమతి హాజరై మాట్లాడారు. ఈ-శ్రామ్ పోర్టల్‌లో నమోదైన కార్మికుడికి రూ.2 లక్షల ప్రమాద బీమా కవరేజ్ ఉంటుందని తెలిపారు. పోర్టల్‌లో నమోదైన కార్మికుడు ప్రమాదానికి గురైనా, మరణించినా లేదా అంగవైకల్యం కలిగినా ఈ బీమా పథకం కింద రూ.లక్షకు అర్హులని తెలిపారు. దేశం బాగుపడాలంటే కార్మికులే కీలకం అన్నారు. ప్రతీ పారిశ్రామికవేత్త విజయం వెనుక వేలమంది కార్మికులు, ఉద్యోగుల కృషి ఉంటుందన్నారు. అనంతరం కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ మాట్లాడుతూ... అసంఘటిత కార్మికులు ఆర్థిక భద్రతతో పాటు ప్రభుత్వ పథకాలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, నాగ స్రవంతి, జ్యోతి విశ్వకర్మ, మెండు రాజమల్లు, గాజుల రాంచందర్, బండ్ల కృష్ణ, ఎస్.గోవిందాచారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భానుమతి

సీఎం సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గెలుపును కాంక్షిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి 4న కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ సీ.త్యాగరాజన్, ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ తెలిపారు. గురువారం కొత్తగూడెంలోని పోస్టాఫీస్ సెంటర్‌లోని ఐఎన్‌టీయూసీ భవన్‌లో ఏర్పాటు చేసిన యూనియన్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 4వ తేదీన కొత్తగూడెంలో జరగనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేయాలని టీపీసీసీ కార్యదర్శి గొల్లపల్లి దయానంద్ తెలిపారు. గురువారం ప్రకాశం స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థులు రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా సీఎం సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్, గాంధీ పథం అధ్యక్షుడు చింతలచెర్వు గెర్షోము, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

పాల్వంచ: వివిధ పార్టీలు, ఇతర వర్గాలకు చెందిన పలువురు పాల్వంచ నేతలు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఖమ్మం వెళ్లి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పొంగులేటి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, పెండ్యాల కృష్ణమూర్తి, తుమ్మల శివారెడ్డి, కొత్తపల్లి సోమయ్య, గంగిరెడ్డి భువన సుందర్‌రెడ్డి, కనగాల నారాయణ తదితరులు ఉన్నారు.

జిల్లా క్రీడాకారుల ప్రతిభ



అభినందిస్తున్న క్రీడాకారులు

కొత్తగూడెంటౌన్: గత ఏప్రిల్ 28న ఖమ్మంలో జరిగిన రాష్ట్రస్థాయి మెన్స్ సింగిల్, డబుల్ విభాగాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన క్రీడాకారులు లోకేష్, డాక్టర్ శశికుమార్, చైతన్య ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు గురువారం వారిని సీనియర్ క్రీడాకారులు శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మంలో జరిగిన పోటీల్లో మెన్స్ సింగిల్స్ విభాగంలో లోకేష్‌బాబు, ప్రథమ, ద్వితీయ డాక్టర్ శశికుమార్ సింగిల్స్‌లో విజయం సాధించగా, డబుల్స్‌లో లోకేష్, చైతన్యలు ప్రథమస్థానాల్లో నిలిచినట్లు తాము ఈ పోటీల్లో గెలవడం చాలా ఆనందంగా ఉందని క్రీడాకారులు తెలిపారు.

మిత్రపక్ష నేతలతో ఎమ్మెల్యే సమావేశం



ఇల్లెందు: నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య



జూలూరుపాడు: ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు

ఇల్లెందు: 13న జరగనున్న ఎంపీ ఎన్నికల సందర్భంగా మిత్రపక్ష పార్టీల నేతలతో కలిసి ప్రచారం నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారు చేసేందుకు నాయకులు సమావేశం అయ్యారు. గురువారం ఇల్లెందు సీపీఐ కార్యాలయంలో సీపీఐ, సీపీఎం, టీడీపీ నేతలతో ఎమ్మెల్యే కోరం కనకయ్య సమావేశం నిర్వహించారు. అన్ని పార్టీల కలయికతో ఓ సభ నిర్వహించాలని, ఇంటింటి ప్రచారం నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో సీపీఐ నుంచి కె. సారయ్య, డి. శంకర్, సీపీఎం నుంచి నబీ, కిరణ్, మోహన్రావు, కూకట్ల శంకర్, టీడీపీ నుంచి ముద్రగడ వంశీ, కాంగ్రెస్ నుంచి కోరం కనకయ్యతో పాటు పట్టణ అధ్యక్షులు డానియెల్, నందకిషోర్, జాఫర్, సూర్యం, శ్రీనివాసరావు ఉన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం...

జూలూరుపాడు: కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ గురువారం రాత్రి కాంగ్రెస్ పార్టీ నాయకులు జూలూరుపాడు ఎస్సీ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పోస్టర్లు అంటించి, ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేస్తూ హస్తం గుర్తుకు ఓటు వేసి, రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు.

ఈ కార్యక్రమంలో నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి, వేల్పుల నరసింహారావు, పోతురాజు నాగరాజు, గోలి జయరాజు, పోతురాజు సుదర్శన్, రాము, మోహన్‌రావు, మందా దేవేందర్, మందా సురేష్, గోలి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

వెంగన్నపాలెం ఎంపీటీసీ సభ్యుడు దుద్దుకూరి మధుసూదన్‌రావు నివాసంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరగనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ తెలిపారు. గురువారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిర్వహించే కాంగ్రెస్ సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌తోపాటు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు లేళ్ల వెంకటరెడ్డి హాజరు కానున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వేసవిలో అదనపు 'ఉపాధి' పొందండి..

పాల్వంచరూరల్: వేసవికాలంలో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతీ కుటుంబం రూ.30వేల అదనపు ఆదాయం పొందాలని గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ ఎం.శేషుకుమార్ అన్నారు. కేశవాపురం పంచాయతీలో ఉపాధి పనుల్లో జరుగుతున్న చెరువు పూడికతీత, జగన్నాథపురంలో నర్సరీ పనులను గురువారం డీఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. నర్సరీల్లో వందశాతం పురోగతి ఉండేవిధంగా చూడాలని, గ్రామాలకు అవసరమైన మొక్కలను గుర్తించి పెంచాలని సూచించారు. ఉపాధి కూలీలకు కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. 150 రోజులు పనిదినాలు కల్పించాలని, డైలీఅలవెన్స్ ఇప్పించాలని కూలీలు కోరారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున్న ఉపాధి కూలీలు ఉదయం 6గంటలకు పనులకు హాజరు కావాలని ప్రతీకూలీ రోజుకు రూ.300 వేతనం పొందేవిధంగా పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీఎం రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ ఎం.అంజనేయులు, డీఆర్డీఓ విద్యాచందన, అదనపు డీఆర్డీఓ రవి, ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి, ఎంపీఓ బి.నారాయణ, ఏపీఓ పొరండ్ల రంగా, ఈసీ పుల్లయ్య, కార్యదర్శులు సాయిరాం, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న శేషుకుమార్

మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం



పాల్వంచరూరల్: రోడ్డుషోలో వినోద్‌రావు

పాల్వంచరూరల్: దేశం అభివృద్ధి చెందాలన్నా, పేదలకు సంక్షేమ పథకాలు అందించాలన్నా, దేశానికి రక్షణ ఉండాలంటే మరోసారి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి కావాలని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి పాతపాల్వంచలో రోడ్‌షో నిర్వహించి కార్నర్ సమావేశంలో పాల్గొన్నారు. మాట్లాడుతూ... ఖమ్మం పార్లమెంట్‌లో బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగా కిరణ్, రాపాక రమేష్, పానిశెట్టి వెంకటేశ్వర్లు, చింతలచెరువు శ్రీనివాసరావు, రంజిత్‌కుమార్, మురళి, రవినాయక్, సందీప్, బత్తుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దు

చుంచుపల్లి: కాంగ్రెస్ పార్టీ నాయకులు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని, వారిచ్చిన హామీలను ఎక్కడ ప్రజలు అడుగుతారోనని బీజేపీ భారత రాజ్యాంగాన్ని మారుస్తుందని, రిజర్వేషన్లు తగ్గిస్తుందని అబద్ధపు మాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోందని, ప్రజలు వాటిని నమ్మే పరిస్థితిలో లేరని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ అబ్జర్వర్, మాజీ మంత్రి డాక్టర్ విజయరామారావు అన్నారు. గురువారం కొత్తగూడెంలో ఆయన నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలకు పార్లమెంట్ ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోదీ పట్ల ప్రజలుకు అపారమైన విశ్వాసం ఉందని, ఆయన ద్వారానే దేశం అన్ని రంగాల్లో చెందుతుందని భావిస్తున్నట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లను గెలవబోతోందని జోస్యం చెప్పారు. ఖమ్మం పార్లమెంట్ స్థానాన్ని ఈసారి బీజేపీ కైవసం చేసుకోనుందని, స్థానికుడైన అభ్యర్థి తాండ్ర వినోద్‌రావును ప్రజలు ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జల్లారపు శ్రీను, నరేంద్రబాబు, గొడుగు శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

పాల్వంచరూరల్: పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా లభించడం వలన కళాశాలకు మార్కెట్‌లోని నూతన ఉద్యోగావకాశాలకు అనుగుణంగా నూతన కోర్సులను ప్రవేశపెట్టుకునే అవకాశం ఉందని తద్వారా ఇక్కడ విద్యను అభ్యసించిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెరుగు పడతాయని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ యర్రం చిన్నప్పయ్య అన్నారు. లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. న్యాక్ అక్రిడేషన్‌లో భాగంగా 3.04 స్కోర్‌తో కాలేజీ ఏ గ్రేడింగ్ సాధించిందని దీని ఆధారంగా 10 సంవత్సరాల వరకు అటానమస్ స్టేటస్ అమలు అవుతుందని చెప్పారు. పెరుగుతున్న విద్యార్థులకు అనుగుణంగా డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. కళాశాలకు రూ.10 కోట్లు పీఎం ఉష నిధులు మంజూరయ్యాయని వీటితో బాలికలకు ప్రత్యేక హాస్టల్ నిర్మాణం, అధునాతన వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో సెంట్రల్ యూనివర్సిటీలో సీటు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు బంగారు పతకాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. వైస్ ప్రసిడెంట్ జె.అబ్రహం, అధ్యాపకులు డాక్టర్ కె.వనజ, డాక్టర్ పి.విజయకుమార్, టి.అరుణకుమారి, కార్తీక్, రాంబాబు, శ్రీనివాసరావు, లీల, సౌమ్య, విమల, దీపిక, హారిక పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య

ఎండలతో అప్రమత్తంగా ఉండాలి

ఇల్లెందురూరల్: ప్రస్తుతం మండుతున్న ఎండల కారణంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ఈ సమయంలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని రొంపేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కవిత సూచించారు. మండలంలోని రొంపేడు పీహెచ్‌సీలో గురువారం ఆమె మాట్లాడుతూ.. చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు పుట్టడం, మగత నిద్ర, కలవరింతలు, ఫిట్స్, పాక్షికంగా అపస్మారక స్థితి వంటివి వడదెబ్బ లక్షణాలని వివరించారు. ఈ సమయంలో ఆరుబయట పనిచేసేవారు సూర్యరశ్మి నుంచి కాపాడుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. తరచూ నీళ్లు తాగాలని, పళ్లరసం, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి ద్రవపదార్థాలు తీసుకోవాలని, తేలికైన తెలుపు లేదా లేతవర్ణపు కాటన్ దుస్తులు ధరించాలని, భోజనం మితంగా తీసుకొని నీటిని అధికంగా తీసుకోవాలని సూచించారు. వేసవిలో బయటకు వెళ్లేటప్పుడు తలకు వేడి తగలకుండా టోపీ ధరించాలని, గొడుగు, తలకు రుమాలు వంటివి ధరించాలని, అత్యవసరమైతే తప్ప పగటి పూట బయటకు రావొద్దని సూచించారు. వడదెబ్బకు గురైన వారిని నీడలో, చల్లని ప్రదేశాలలో మాత్రమే ఉంచాలన్నారు. శరీర ఉష్ణోగ్రత తగ్గే వరకు తడిగుడ్డతో తడపాలని పేర్కొన్నారు.

తారు రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం

- వానాకాలం లోపు పూర్తి చేయాలి
- లేదంటే ప్రజలు, రైతులకు ఇబ్బందులు
- అధికారులు స్పందించాలని వినతి

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం తెలగరామవరం పంచాయతీలోని తెలగరామవరం నుంచి మదార్ తండా రెండు కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణ పనులు జాప్యం జరుగుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా సంబంధిత కాంట్రాక్టరు పనులు చేయడం లేదని ఆరోపిస్తున్నారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని తెలగరామవరం నుంచి మదార్ తండా వరకు తారు రోడ్డు నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో తారు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి, మధ్యలోనే నిలిపివేశారు. ఈ రోడ్డు నిర్మాణంతోపాటు ఎనిమిది కల్వర్టులు నిర్మాణం చేయాల్సి ఉంది. ప్రస్తుతం నాలుగు రోజుల నుంచి రెండు కల్వర్టుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. తారు రోడ్డు నిర్మించేందుకు మట్టి తవ్వి మెటల్ పోశారు. కానీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణం వల్ల టేకులపల్లి నుంచి కారుకొండ, తెలగరామవరం, సర్వారం, ప్రజలు, రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. టేకులపల్లి, కొత్తగూడెం, హౌజింగ్ బోర్డు ఐదు కిలోమీటర్లు దూరం ఉంటుంది. వారికి ఈ రోడ్డు నిర్మాణం వల్ల ఐదు కిలోమీటర్లు దూరం తగ్గుతుంది. తెలగరామవరం పంచాయతీ మదార్ తండా ప్రజలు పంచాయతీ కార్యాలయానికి, రేషన్‌కు రావాలంటే 15 కిలోమీటర్లు చుట్టు తిరిగి రావాల్సి ఉంటుంది. ఈ రోడ్డు నిర్మాణం వల్ల 13 కిలోమీటర్లు దూరం తగ్గింది. మదార్‌తండా, తెలగరామవరం, కారుకొండ, సర్వారం తదితర గ్రామాలలోని రైతులు ఈ రోడ్డు గుండా రాకపోకలు కొనసాగిస్తారు. దాదాపు 30 సంవత్సరాలుగా మదార్‌తండా, కారుకొండ, సర్వారం ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతుండేవారు. ఈ తారు రోడ్డు మంజూరై రైతులు, ప్రజలు సంతోషించినా... పనులు నత్తనడకసాగుతుండటంతో నిరాశ చెందుతున్నారు. నెల రోజుల్లో తారు రోడ్డు నిర్మాణం పనులు పూర్తి కాకపోతే, వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయి. వర్షాలు పడితే ఈ రోడ్డు నిర్మాణం పనులు అస్తవ్యస్తంగా తయారవుతాయి. వర్షాకాలం లోపు నిర్మాణం పనులు పూర్తి కాకపోతే రైతులు వ్యవసాయ పనులకు వెళ్లేందుకు, పొలాలకు పనిముట్లు, పురుగుల మందులు, మందుకట్టలు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు తప్పవు.





మదార్ తండా రోడ్డులో జరుగుతున్న కల్వర్టుల నిర్మాణ పనులు

రోడ్డు పనులు వేగంగా చేయాలి



తెలగరామవరం పంచాయతీ మదార్‌తండా వరకు తారు రోడ్డు నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని రోడ్డు నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలి. ఈ విషయంపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మేమ నగేష్, తెలగరామవరం

ఇబ్బందులు తొలగిపోతాయి..



మదార్ తండా తారు రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలి. ఈ తారు రోడ్డు నిర్మాణం జరిగే పొలాలకు వెళ్లే రైతులకు, ప్రజలకు ఉపయోగపడుతుంది. టేకుపల్లి నుంచి సర్వారం రాకపోకలు కొనసాగించటానికి సులువుగా ఉంటుంది.

– నారసాని సుధాకర్, తెలగరామవరం